

(గత సంచిక తరువాయి)

అతను పక్కకి తప్పుకున్నాక క్రిస్ వెనక నిలబడ్డ జై బై వూకి లేప్‌టాప్‌లో కొత్త బొమ్మని మార్చాడు.

ఎఫ్+పరిగెత్తే మనిషి+డైమండ్ ఏస్ కనిపించింది. అదే దేశం పేరో జై బై వూకి వెంటనే తట్టలేదు.

"టైమ్ అప్" క్రిస్ చెప్పాడు.

జై బై వూ బౌల్‌లోని నిమ్మముక్కని తీసుకుని నోట్లో ఉంచుకుని నమిలాడు. అతని మొహంలోని ఫీలింగ్స్ తర్వాత వీడియో చూసేవారికి వినోదాన్ని ఇస్తాయి. అతని వెనక నిలబడ్డ క్రిస్టినా వచ్చి నిలబడి చెప్పింది.

"ఎఫ్ రన్ ఏస్...ఎఫ్ రన్ ఏస్...ఎఫ్...రన్...ఫ్రాన్స్."

తెరమీద ఫ్రాన్స్ పేరు కనిపించింది. ఆమె వెళ్ళాక వెనక నిలబడ్డ కార్లోస్ చూసాడు.

టిన్+ఏడిఏ.

"టిన్...అల్యూమినియం...కేన్...కేన్ అడా....కెనడా."

తెరమీద కెనడా పేరు కనిపించింది. ఆ ఆట ఫాతిక దేశాల పేర్లతో పూర్తైంది. చైత్రకి తనవైపు చూపించుకునే ఓ మనిషి +పరిగెత్తే పిల్లవాడి బొమ్మ వచ్చింది.

"ఐ...రన్...ఇరాన్" చెప్పింది.

ఆద్యకి తెరిచిన నోరు+మనిషి బొమ్మ వచ్చింది. ఆమె చెప్పలేకపోయింది. ఆమె వెనకున్న అలెక్సీ చెప్పాడు.

"ఓ...మేన్...ఒమన్."

మరికొన్ని చెయిన్+ఏ అక్షరం. చైనా.

పాడే అమ్మాయి బొమ్మ+ఏ అక్షరం+కప్పులోంచి కిందకి కారే ద్రవం. సింగపూర్. దీన్ని ముగ్గురు చెప్పలేకపోయారు.

జెర్మ్+మార్క్స్ నోట్. జర్మనీ.

తొడ+నేల. థాయ్‌లేండ్.

ఎదురుగా మనిషిని చూపించే బొమ్మ+ఏ అక్షరం+ఈ అక్షరం. యు.ఏ.ఈ.

ఎస్+చెవి బొమ్మ+తేనెటీగ+ఏ అక్షరం. సెర్బియా. దీన్ని ఇద్దరు చెప్పలేకపోయారు.

ఆ ఆట ఆడేప్పుడు నవ్వులే నవ్వులు.

ఆ తర్వాత డీహైడ్రేషన్ గేమ్ తో ఆ ఫ్రైడే మీట్ ముగిసింది.

"ఒన్ క్వశ్చన్ మిస్ వెరా విబావా! మొనాకో, ఇండోనీషియా ఫ్లాగ్స్ ఒకేలా వుంటాయా?" చైత్ర అడిగింది.

"అవును. మా రెండు దేశాల జెండాల పై అర్ధభాగం ఎరుపు, కింది అర్ధభాగం తెలుపు. కాని మొనాకో జెండా సన్నగా ఉంటుంది. మాది పెద్దది. ఇలాగే చాడ్, రుమేనియా జండాలమీద కూడా నీలం, పసుపు, ఎర్ర రంగులు నిలువుగా ఉంటాయి. నీలం షేడే తేడా. బిర్యానీ నాకు చాలా నచ్చింది. దయచేసి నాకు రెసిపీని పంపుతావా?"

"థాంక్స్. యుట్యూబ్ లింక్ పంపుతాను. క్రితం శుక్రవారం నువ్వో టంగ్ ట్విస్టర్ చెప్పావు కదా?" చైత్ర అడిగింది.

"అవును."

"నా మాతృభాష తెలుగులో కూడా అలాంటి పొయిట్రీ ఉంది. ఒకటి చెప్పనా?"

"తప్పకుండా."

"ఓ కవి రాసిన ఏకాక్షరి పద్యం ఇది. అంటే ఒకే అక్షరంతో రాసిన స్టాంజా.

నే నెన్నై నను నీ నన్నానా నే నాన నూనన నన్న ననౌనా

నిన్ను నెన్న నన్నానా నేననానన నానినా నన్నన్నా."

"సౌండ్స్ గుడ్. దీనికి అర్ధముందా?" అది విన్న సల్మాన్ అడిగాడు.

"ఉంది. మాకు సంధులని ఉన్నాయి. వాటిని కలపబట్టి కేవలం న గుణింతంతో ఈ పద్యాన్ని అల్లగలిగారు. నేను ఎన్నైననూ ఇవ్వనన్నానా? నేను ఆనను అంటే ఆజ్ఞని ఊననా? అంటే శిరసావహించనా? నన్ను అననౌనా? నన్ను మీరు అనొచ్చునా? నిన్ను ఎన్నను అన్నానా? నిన్ను లెక్కచేయను అన్నానా? నేను అనానన అంటే నేను సిగ్గుని, ఆనినా అంటే పొందాను. అన్నన్నా అంటే ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసే జాతీయం. మరో విశేషం ఇది నోక్ష పద్యం. అంటే ఇది ఉచ్చరిస్తూంటే పెదవులు ఒకదానికొకటి తగలవు."

"ఎవరు రాసారు?" ఖాలెద్ అడిగాడు.

"గద్వాల్ సంస్థానానికి చెందిన పోకూరి కాశీపతి అవధాన్లుగారు. హరిశ్చంద్రోపాఖ్యానంలో తనమీద కోపాన్ని వ్యక్తం చేసిన విశ్వామిత్రుడిని హరిశ్చంద్రుడు శాంతింపచేస్తూ పలికిన మాటలివి."

పియర్ ఫ్రెంచ్ భాషలో ఓ వాక్యం ముద్రించిన టీ షర్ట్‌ని ఆద్యకి బహుకరించాడు.

"దీనర్ధం? చవక భోజనం అని కాదుగా?" ఆద్య నవ్వుతూ అడిగింది.

"కాదు. 'స్మెల్ మోర్. వర్రీ లెస్' అని ఫ్రెంచ్ భాషలో ఉంది" అతను నవ్వుతూ జవాబు చెప్పాడు.

"సర్కిల్ ఆఫ్ ఫ్రెండ్స్‌లో క్వాంటిటీ కన్నా క్వాలిటీ ముఖ్యం. నీకు బోర్ కొట్టిందా?" చైత్ర ఇంటికి వచ్చాక అడిగింది.

"అక్కడక్కడా. షికాగోకి ఆ పేరు ఎలా వచ్చింది అన్న గేమ్ నాకు నచ్చలేదు" ఆద్య జవాబు చెప్పింది.

"నువ్వు సినిమా క్విజ్‌లని ఎంజాయ్ చేస్తావని నాకు తెలుసు. బొమ్మలని చూసి లేదా ఇంగ్లీష్‌లోకి అనువదించిన తెలుగు సినిమా పేరు కనుక్కోవడం, హీరో, హీరోయిన్ స్టిల్‌ని చూసి అదే సినిమాదో కనుక్కోవడం, పాటని బట్టి అదే సినిమాలోదో కనుక్కోవడం, క్లుప్తంగా చెప్పిన కథని బట్టి ఏ సినిమానో కనుక్కోవడం, సైడ్ కేరక్టర్స్ స్టిల్స్ చూసి అదే సినిమానో.. పాత సినిమాలోని స్టిల్‌ని చూసి అదే పేరుతో తీసిన కొత్త సినిమా పేరు.. సినిమా...సినిమా...సినిమా.. మీకు సినిమానే ప్రపంచం. ఓ హీరోయిన్ ఉప్పు, కారం చల్లిన మామిడి ముక్కలని ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేస్తే గంటలో ఐదు లక్షల లైక్స్. ఇండియన్ యూత్‌కి ఏది అవసరమో దీన్నిబట్టి అర్థమౌతోంది. దేశంలోని వేల సమస్యలని వాళ్ళు పట్టించుకోవడంలేదు.

"చాలామంది ఇండియన్స్ తమకి అవసరంలేని సమాచారాన్ని గౌరవించరు. అందుకే ట్రావెలాగ్స్, నాన్ – ఫిక్షన్ రాసేవారూ, చదివేవారూ తక్కువ. ఇండియన్స్ అనుకుంటారు, 'మా ఊళ్ళో ఇండియన్స్ మధ్యే పని చేస్తాను. కాబట్టి ప్రపంచం గురించి నేర్చుకోవాల్సిన అవసరం నాకు లేదు. నా పరిధి వరకు తెలుసుకుంటే చాలు.' మా ప్రాంతంవి తప్ప, పానీరీపూ రగడా, పావ్‌బాజీ, ఫ్రైడ్ రైస్, ఇడియాప్పం, రసగుల్లా లాంటి ప్రపంచంలోని ఇతర వంటకాలని తినకపోవడంతో ఇది సమానం. నువ్వు ఎక్కడ ఉన్నావన్నది కాదు. ప్రపంచం నించి ఎంత ప్రయోజనం పొందుతున్నావన్నది ముఖ్యం. ఎట్ది ఎండాఫ్ ది డే, నువ్వు ఎంత సాధించావన్నది కాక, నిన్నటికన్నా నువు ఎంత ఎదిగావన్నది ముఖ్యం. చెప్పాగా. నిన్నటి నీకన్నా నేటి నువ్వు ఎదగాలని" చైత్ర చెప్పింది.

"డెవలపింగ్ కంట్రీకి, డెవలప్డ్ కంట్రీకి మధ్యగల తేడా ఏమిటి?" ఆద్య కాసేపాగి అడిగింది.

"అందుకు చాలా వివరించాలి. సింపుల్‌గా చెప్పాలంటే డెవలపింగ్ కంట్రీలో చెత్తకి కంపోస్ట్, ప్లాస్టిక్స్, గ్లాస్, పేపర్లకి ప్రత్యేకంగా చెత్త డబ్బాలు ఉండవు" చైత్ర వివరించింది.

కొద్దిసేపాగి చెప్పింది.

"నాకా జవాబు తృప్తిగా లేదు. తేనెటీగ ఒకో పుష్పనించి తేనె సేకరించినట్లు, డెవలప్డ్ దేశ ప్రజలు సమాచారాన్ని సేకరిస్తారు. విసుగు కలగకుండా దాన్నో ఆటగా ఆడడం నాకు బాగా నచ్చింది. సూర్యుడు భూమికి తొమ్మిది కోట్ల ముప్పై లక్షల మైళ్ళ దూరంలో ఉన్నాడని కనుక్కున్నారు. ఎలా? కాంతి వేగం లక్షా ఎనభై ఆరువేల మైళ్లని కనుగొన్నారు. భూమినించి పదడుగులు కూడా ఎగరలేని మనిషి చంద్రుడి మీదకి అనేకసార్లు వెళ్ళొచ్చాడు. ఎలా? కంటికి కనపడని అనేక రోగ క్రిములని కనిపెట్టాడు. ఎలా? ఇవన్నీ ఆసక్తి, ఆలోచన, విశ్లేషణల ద్వారా తెలుసుకోబట్టి. ఇవన్నీ డెవలప్డ్ కంట్రీస్ ప్రజల దృక్పథం వల్ల సాధ్యమయ్యాయి. డెవలపింగ్ కంట్రీస్ ప్రజల్లో ఈ ఆసక్తి, ఆలోచన, విశ్లేషణలు ఉండవు."

"కాని సూర్యుడి మధ్య దూరాల్లాంటివి మన వేదాల్లో ఉన్నాయని..."

"అదే నిజమైతే అప్పుడు ఇండియా డెవలప్డ్ కంట్రీ. హీరోయిన్ మామిడి ముక్కల ఫోటోని చూసి ఆనందించే ఇప్పుడు కాదు. గుడ్‌నైట్" చెప్పి చైత్ర తన గదిలోకి వెళ్ళిపోయింది.

30

శనివారం ఉదయం పదకొండున్నరకి కాని అక్కాచెల్లెళ్ళు ఇద్దరూ నిద్రలేవలేదు. లేచాక చైత్ర కాఫీ తాగుతూ కంపెనీ ఈమెయిల్స్‌ని చూసుకుని ఖాలెద్‌కి ఫోన్ చేసింది.

"గుడ్ మార్నింగ్ నువ్వు పేరిస్‌కి మన హెడ్‌క్వార్టర్స్‌కి వెళ్తున్నావు కదా?"

"అవును. గుడ్‌మార్నింగ్. ఇప్పుడే నేనూ ఈమెయిల్ చూసుకున్నాను" అతను చెప్పాడు.

"పేరిస్ రెస్టారెంట్లో వాటర్‌ని ఆర్డర్ చేసేప్పుడు జాగ్రత్త. ఫ్రాన్స్ నియమాల ప్రకారం టేప్ వాటర్‌ని ఉచితంగా ఇవ్వాలి. అవి తాగడానికి భద్రమైనవే. యునెకెరాఫే లేదా పిచర్ ఆఫ్ వాటర్ అంటే టేప్ వాటర్ అనర్థం. దాన్నో జగ్‌లో తెస్తాడు. అది ప్రత్యేకంగా చెప్పకపోతే స్పార్కిలింగ్ వాటర్‌ని సీసాలో తెస్తాడు. దానికి బీర్‌కన్నా ఎక్కువ ఛార్జ్ చేస్తారు."

"ఓ! థాంక్స్ ఫర్ ది టిప్" అతను చెప్పాడు.

"కొద్దిసేపు స్విమ్మింగ్ చేద్దామా డాలీ?" చెల్లెల్ని అడిగింది.

ఇద్దరూ స్విమ్ సూట్స్‌లో పూల్ దగ్గరకి వెళ్ళారు.

"ఈతలో చాలా రకాలున్నాయి. డాల్ఫిన్ స్ట్రోక్, బటర్‌ఫ్లై స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, సైడ్స్ స్ట్రోక్, బేక్ స్ట్రోక్, ఫ్రంట్ స్ట్రోక్. ముందీ ఫ్రీ స్టైల్ లేదా అమెరికన్ క్రాల్ వస్తే తర్వాత క్రమంగా అవి తేలికగా చేయగలవు. ముందు నీళ్ళల్లో గాలి పీలుస్తూ తేలడం ముఖ్యం. నీకు ఇప్పుడు నీళ్ళమీద దేన్నీ పట్టుకోకుండా తేలడం వచ్చు. మునిగితే ఎలా పైకి రావాలో తెలుసు. కాబట్టి ఇవాళ్టినించి అమెరికన్ క్రాల్‌ని ప్రాక్టీస్ చెయ్యి. నీళ్ళమీద తేలుతూ, ఓ చేతిని గాల్లోకి పూర్తిగా లేపి, దాన్ని నిటారుగానే ఉంచి నీళ్ళల్లోకి వెళ్ళగానే నీ సైడ్‌కి జరుపు. అప్పుడు నీటిని ఆ చెయ్యి తోస్తుంది. అదే సమయంలో రెండో చేతిని అదేవిధంగా చెయ్యి. తలని నీళ్ళల్లోంచి పక్కకి పైకి తిప్పి గాలి పీల్చు. ఇది ప్రాక్టీస్ చెయ్యి. హైద్రాబాద్‌కి వెళ్ళాక స్విమ్మింగ్ పూల్‌లో సభ్యత్వం తీసుకుని ప్రాక్టీస్‌ని కొనసాగించు. నీకు ఈత బాగా వచ్చినా బరువు ఏభై తొమ్మిదికి తగ్గేదాకా ఆపకు. స్టే ఫిట్" చైత్ర ఆఖరి స్విమ్మింగ్ లెసన్ ఇచ్చాక చెప్పింది.

సాయంత్రం ఖాలెద్ ఫోన్ చేసి అడిగాడు.

"బీచ్‌కి వెళ్దామా?"

అక్కాచెల్లెళ్ళు అతని ఇంటికి వెళ్ళారు. టీ తాగి ముగ్గురూ కలిసి బీచ్‌కి వెళ్ళారు. అతన్ని చూస్తే అన్ని కష్టాలు అనుభవించే మనిషిలా ఆద్యకి తోచలేదు. తొణక్కుండా, విచారాన్ని బయటకి ప్రదర్శించకుండా, కష్టాలని భరించడం అనే కళని అతన్ని చూసాక తను విమానంలో వస్తూ ఏడవడం తలచుకుని సిగ్గుపడింది.

"ఖాలెద్. నీకో ప్రశ్న."

"ఎస్ ఆద్య?"

"కష్టాలు పడుతున్నావన్న సూచన కనపడకుండా సదా నవ్వడం ఎలా సాధ్యమౌతోంది?"

అతను కొన్ని క్షణాలు ఆలోచించి చెప్పాడు.

"జీవితం హార్మోనియం లాంటిది. తెల్లమెట్లు ఆనందకరమైన రోజులు. నల్లమెట్లు విచారకరమైన రోజులు. సంగీతం కోసం ఈ రెండూ అవసరం. నాకు చాలా సమస్యలు ఉన్నాయి. కాని నా పెదవులకి అవి తెలియవు కాబట్టి సదా నవ్వుతూంటాను."

కొద్దిసేపాగి మళ్ళీ చెప్పాడు.

"నీళ్ళల్లో పడటం వల్ల ఎవరూ చావరు. అందులోంచి బయటకి రాకపోవడంవల్లే చస్తారు. కష్టాల్లోని వారు వాటిని అధిగమించే ప్రయత్నం చేస్తూంటే నిరాశపడరు. ఒసారి హాలీవుడ్ నటుడు పీటర్ సెల్లర్స్‌ని విమానాశ్రయంలో ఎవరో గుర్తుపట్టి అడిగారు. 'మీరు పీటర్ సెల్లర్స్ కదా?' పీటర్ సెల్లర్స్ జవాబు 'ఈరోజు కాదు' అతని ఉద్దేశం తను నటించే రోజే పబ్లిక్‌కి తెలిసిన పీటర్ సెల్లర్స్. లేదా ఉత్తి పీటర్ సెల్లర్సే. ఇలాగే కష్టం వచ్చిన రోజు 'నేను ఖాలెద్‌నికాదు. అది ఖాలెద్‌కి వచ్చింది. ఖాలెద్ వేరు. నేను వేరు' అని భావిస్తూంటాను."

ముగ్గురూ ఓ రెస్టారెంట్‌లో బీర్ తాగి, కొద్దిసేపు నీళ్ళల్లో గడిపి తిరిగి వస్తూండగా అతను ఆహ్వానించాడు.

"ఇంటికి రండి. ఐ విల్ హోస్ట్ డిన్నర్ ఫర్ యు."

ముగ్గురూ అతని ఇంటికి వెళ్ళారు. అతను కాల్‌కెన్నాన్ అనే సంప్రదాయ ఐరిష్ వంటకాన్ని, మాష్డ్ పోటాటోస్, స్కాలియన్స్, వెన్న, ఉప్పు, పెప్పర్లతో కేల్ అనే ఆకు కూర చేసాడు.

"చాలా రుచిగా ఉంది" అక్కా చెల్లెళ్ళిద్దరూ చెప్పారు.

అందులో నంచుకోడానికి వంకాయలతో లెబనీస్ వంటకం బాబా గనౌష్ చేసాడు. ఇరాన్ సినిమా 'ది టేస్ట్ ఆఫ్ చెర్రీ'ని అతనితో కలిసి చూసారు. ఒకతను ఆత్మహత్య చేసుకోదలిచి, తను గోతిలో మరణించాక మర్నాడు తన దేహాన్ని కప్పడానికి ఓ వ్యక్తిని వెదకడమే ఆ చిత్రకథ. ఈ చిన్న అంశంతో చివరిదాకా కూర్చోపెట్టేలా తీసారు. ఆద్య దాన్ని చాలా ఆసక్తిగా చూసింది.

చైత్ర ఇంటికి వచ్చాక ఆద్య చెకిన్ లగేజ్ బరువుని చెక్ చేసింది. నాలుగు కిలోలు తక్కువే ఉంది.

"నీ బరువు చూద్దం. ఎక్కు" ఆద్యతో చెప్పింది.

"డెబ్బై తొమ్మిది. ఈ మూడు వారాల్లో స్విమ్మింగ్ వల్ల, డీప్ ఫ్రై ఐటమ్స్ తినకపోవడం వల్ల నాలుగు కిలోలు తగ్గావు. గెట్ బేక్ టు ఫిఫ్టీ నైన్ కిలోస్."

ఆ రాత్రి కూడా అక్కాచెల్లెళ్ళు చిన్నప్పటి విషయాలు ముచ్చటించుకుంటూ చాలాసేపు నిద్రపోలేదు.

"తక్కువలో ఆనందం ఉందని, సమృద్ధిలో లేదని నాన్న చెప్పేవారు. చిన్నప్పుడు ఏడాదికో పండక్కి డ్రస్ కుట్టిస్తే ఎంత ఆనందమోనట. ఎప్పుడు పండగ వస్తుందా, ఎప్పుడు వేసుకుందామా అని ఎదురుచూపుల్లో ఆనందం. ఇప్పుడు మనం చూసి బావుందని కొని వార్డ్‌రోబ్‌లో పెట్టి మర్చిపోతాం. నడిచివెళ్ళి నెలకో సినిమా చూసి ఇంటికి వచ్చాక గంట దాకా ఆ సినిమా కబుర్లేట. మనం ఛానల్స్ తిప్పుతూ సినిమాలని ఎంజాయ్ చెయ్యకుండా సగమో, పావువంతో చూస్తున్నాం. మూడు గదుల రైలు పెట్టెలాంటి ఇంట్లో అంతమంది ఉన్నా, చాపేసుకుని నేలమీద పడుకున్నా హాయిగా నిద్రపోయేవారు. రిక్షా ఎక్కితే ఆనందం. మనం ఇప్పుడు విమానం ఎక్కినా ఆ ఆనందం లేదు. నాన్న చెప్పినట్లు బీరువా తెరిస్తే కాళ్ళమీద పడేటన్ని బట్టలకన్నా ఏడాదికోసారి కొనే బట్టలే ఎక్కువ ఆనందాన్నిస్తాయి" ఆద్య చెప్పింది.

"రేపే నీ ప్రయాణం. ఇంక పడుకుందాం" చైత్ర పదకొండుం ముప్పావుకి చెప్పింది. కాని పన్నెండుంపావుదాకా వాళ్ళ మాటలు ఆగలేదు.

"నీకో జీవితసత్యం చెప్పనా? ఒకటి కావాలనుకుంటే సాధారణంగా మరోదాన్ని త్యాగం చెయ్యాలి. ఈ రాత్రి ఆనందంగా గడిపితే రేపు సూర్యుడ్ని మిస్ అవుతావు. గుడ్ నైట్" చైత్ర చెప్పింది.

"నువ్వు నైజీరియా వెళ్తున్నావు కదా?"

"అవును. వచ్చేవారం ఈ పాటికి అక్కడ లేండవుతూంటాను."

"కిడ్నాపర్స్ ఉంటారన్నావు. జాగ్రత్త" ఆద్య హెచ్చరించింది.

"మాకు ట్రైనింగ్ ఇచ్చార్లే."

కొద్దిసేపు పడుకున్నాక ఆద్య లేచి ఆ అర్ధరాత్రి స్విమ్మింగ్ డ్రెస్ వేసుకుని ఈతని ప్రాక్టీస్ చేసింది. ఆ క్షణం టకరోడీలోనే వచ్చింది.

ఆమె నీళ్ళల్లో నునగకుండా తేలిగ్గా స్విమ్మింగ్‌పూల్‌లో ఆ చివరినించి ఈ చివరకి, ఈ చివరకి, ఈ చివరినించి ఆ చివరకి అరడజను సార్లు ఈదింది.

తిరిగి వచ్చి హౌస్ గౌన్‌లోకి మారి పడుకుంది.

పడుకున్నాక ఆద్య కిటికీలోంచి కనిపించే చంద్రుడ్ని చూస్తూ అనుకుంది. 'నాతోపాటు ప్రపంచంలో ఇంకా ఎంతమంది ఈ క్షణంలో చంద్రుడ్ని చూస్తున్నారో?'

(ముగింపు వచ్చే సంచికలో)

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి

www.anandbooks.com
www.telugubooks.in

Post your comments